క్లుప్తంగా

ఉపాధ్యాయుల నిరసన



తెనాలిరూరల్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు ఉపాధ్యాయులు నల్ల రిబ్బన్లతో నిరసన వ్యక్తం చేశారు. రూరల్ గ్రామం సంగం జాగర్లమూడి ఎంపీపీ ఎలిమెంటరీ పాఠశాలలో గురువారం నిరసనలో భాగంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణం విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని, ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, యాప్‌లు, బుక్‌లెట్ విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగలకుదురులో పుట్టా జనార్ధనరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్ల రిబ్బన్‌లను ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు స్టీల్‌వాటర్ డ్రమ్ము బహూకరణ



తెనాలిఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ సభ్యులు నేరేళ్ళ దిలీప్ పుట్టిన రోజును పురస్కరించుకుని తులసీరామ్ చౌక్‌లోని స్పెషల్ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌కు గురువారం స్టీల్ వాటర్ డ్రమ్మును ఉచితంగా ఇచ్చారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారులు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబులు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన వస్తువులను దాతలు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు లయన్ కాకరపర్తి సుబ్రమణ్యం, సభ్యులు అయినాల మల్లేశ్వరరావు, పాదర్తి వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం.లీలాకృష్ణ, ఉపాధ్యాయులు వెంకటగోపాలరావు, మౌనిక, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు

మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ యేసుబాబు

తెనాలిఅర్బన్: పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మువ్వా యేసుబాబు పేర్కొన్నారు. పట్టణంలోని పలువార్డుల్లో గురువారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లో ఉత్పత్తి అయిన చెత్తను కార్మికులకు అందజేయాలని సూచించారు. అలాగే రోడ్లపై ఎటువంటి వ్యర్థాలను వేయవద్దన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

సినీ పరిశ్రమ అభివృద్ధి ప్రశ్నార్థకంగా ఉంది



తెనాలిరూరల్: రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధి ప్రశ్నార్థకంగా ఉందని సినీ దర్శకుడు దిలీప్ రాజా అన్నారు. రూరల్ పరిధిలోని పెద రావూరులో గురువారం ఆయన మాట్లాడుతూ మహానటుడు ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ అధికారంలో ఉండగా, మరోవైపు నటుడు పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్నా ఏడాది కాలంగా సినీ పరిశ్రమ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సినీపరిశ్రమకు కావల్సిన మౌలిక సదుపాయల కల్పనలోనూ జాప్యం జరుగుతోందన్నారు. ప్రభుత్వంతో ఏవైనా చర్చలు జరిగే సందర్భంలో ఏపీ ప్రాతినిథ్యం లేకుండా తెలంగాణ సినీ పెద్దలతో మాత్రమే సమావేశం నిర్వహిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

14న టౌన్ పాస్టర్స్ అసోసియేషన్ సమావేశం

తెనాలి: ది తెనాలి టౌన్ పాస్టర్స్ గ్రేట్ సపోర్ట్ అండ్ ఫుల్ హెల్పింగ్ అసోసియేషన్ సమావేశం ఈ నెల14 వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక ఇస్లాంపేటలోని యేసయ్య ప్రార్థనా కొండ చర్చిలో జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు బ్రదర్ ఆనందన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిక చేసిన తెనాలి పట్టణ పాస్టర్ల కుటుంబాలకు రూ.1500 విలువైన 26 కిలోల రైస్ బ్యాగ్స్ ఉచితంగా అందజేస్తామని తెలియజేశారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

శక్తి స్వరూపిణి అమ్మవారిని పూజించాలి

అద్దేపల్లి(భట్టిప్రోలు): శక్తి సముపార్జన కోసం శక్తి స్వరూపిణి అమ్మవారిని పూజించి శరన్నవరాత్రులను జరుపుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ పేర్కొన్నారు. గురువారం భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి ఎస్టీ కాలనీ రామాలయంలో ఎస్ఎస్ఎఫ్ మండల కన్వీనర్ వేల్పూరి శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

ఇంకెన్నాళ్లు ఇన్‌చార్జి పాలన?

- నాలుగు మాసాలైనా పూర్తికాని కమిషనర్ నియామకం
- ఖాళీ అయిన అసిస్టెంట్ కమిషనర్ పోస్ట్
- రాజకీయ చట్రంలో ఇరుక్కుంటామనే భయంతో తెనాలి రాని అధికారులు
- స్తంభించిన పాలన



తెనాలి పురపాలక సంఘ కార్యాలయం

తెనాలిఅర్బన్: పట్టణంలో ఇన్‌చార్జి పాలన కొనసాగుతోంది. నాలుగు నెలల క్రితం జరిగిన సాధారణ బదిలీలలో కమిషనర్ బదిలీ కావటంతో అసిస్టెంట్ కమిషనర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తు వచ్చారు. ఆయన గతనెల చివర్లో పదవీ విరమణ చేయటంతో రెండు కీలక పోస్టులు ఖాళీగా మారాయి. హాట్ కేక్‌లా ఉండే రెండు పోస్టులు ఖాళీగా మారడంతో ఇన్‌చార్జిలే దిక్కయ్యారు. చేసేదిలేక వారు నామమాత్రంగా విధులు నిర్వహిస్తు పాలనను గాలికి వదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గుంటూరు జిల్లాలో ఏకైక సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా తెనాలికి పేరుంది. పట్టణంలో సుమారు 2 లక్షల జనాభా నివశిస్తున్నారు. ఏడాదికి వివిధ రకాల పన్నుల ద్వారా రూ.23.7 కోట్ల ఆదాయం సమకూరుతూ ఉంటుంది. ఇవి కాకుండా వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్‌ల ద్వారా రూ.95 కోట్లు తెనాలికి వస్తుంటాయి. ఖాళీగా కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ల పోస్టులు జూన్ నెలలో జరిగిన సాధారణ బదిలీలలో తెనాలి పురపాలక సంఘ కమిషనర్‌గా పని చేస్తున్న బండి శేషన్న నంద్యాల మున్సిపాలిటీకి వెళ్ళారు. గుంటూరు కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న చల్లా ఓబులేసును ఆ సమయంలో తెనాలికి బదిలీ చేశారు. బదిలీ ఉత్తర్వులు అందిన వెంటనే శేషన్న రిలీవ్ అయ్యారు. రెండు రోజుల్లో ఓబులేసు విధులలో చేరుతారనే ప్రచారం జరుగుతుండగా ఓబులేసును గుంటూరులోనే కొనసాగించాలని కోరుతూ కమిషనర్ పులి శ్రీనివాస్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. దీంతో ఆయన బదిలీ నిలిచిపోయింది. దీంతో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న వీఎం లక్ష్మీపతిరావుకు కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన ఆగస్టు నెలఖారున పదవీ విరమణ చేయటంతో రెండు పోస్టులు ఖాళీ అయ్యాయి. చేసేదిలేక ఉన్నతాధికారులు మున్సిపల్ ఇంజినీర్ పి.శ్రీకాంత్‌కు కమిషనర్‌గా, ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబును అసిస్టెంట్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో మున్సిపాలిటీలో కీలకగా ఉండే రెండు పోస్టులు ఖాళీ అయ్యాయి.

రాజకీయ చట్రంలో కీలక పోస్టులు

సాధారణంగా తెనాలి మున్సిపాలిటీలోని కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ పోస్టులకు పోటీ ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ పనిచేసేందుకు అధికారులు ఎక్కువ ఆసక్తి చూపుతుంటారు. దీనికి కారణం సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ కావటంతో పాటు ఆదాయం కూడా ఎక్కువగానే వస్తుందనేది జగమెరిగిన సత్యం. అలాంటి తెనాలి మున్సిపాలిటీలో కమిషనర్‌గా పనిచేసేందుకు సీనియర్ అధికారులు ముందుకు రావటం లేదంటే దీనికి ప్రధాన కారణం టీడీపీ, జనసేన పార్టీల ప్రజాప్రతినిధుల మధ్య ఉన్న విభేదాలేనని చెప్పవచ్చు. టీడీపీ, జనసేన పార్టీల ప్రజాప్రతినిధులు కడుపులో కత్తులు పెట్టుకుని ఆలింగనం చేసుకుంటున్నారనేది బహిరంగ రహస్యం. దీంతో అధికారులు ఒకరితో మంచిగా ఉంటే మరొకరికి పగ అవుతామనే భావనతో ఎవ్వరు



ఖాళీగా ఉన్న కమిషనర్ కుర్చీ

తెనాలి మున్సిపాలిటీకి వచ్చేందుకు ఆసక్తి చూపటం లేదు. కమిషనర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ ఇంజినీర్ శ్రీకాంత్ అత్యవసర బిల్లులపై సంతకాలు చేయటం మినహా మిగిలిన విభాగాల పర్యవేక్షణను పూర్తిగా వదిలేశారు. అసిస్టెంట్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించిన ఆరోగ్యాధికారి డాక్టర్ యేసుబాబు వైద్య, ఆరోగ్యా శాఖ నుంచి డిప్యూటేషన్‌పై తెనాలి మున్సిపాలిటీకి మొదటిసారి రావటం వలన ఆయనకు మున్సిపాలిటీపై కనీస అవగాహన లేకుండా పోయింది. కేవలం ఆయన పారిశుద్ధ్య విభాగాన్ని మాత్రమే చూస్తు వస్తున్నారు. దీంతో తెనాలిలో పూర్తిగా పాలన పడకేసిందనే చెప్పవచ్చు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి వెంటనే తెనాలి మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గ్రామీణ రహదారులు అధ్వానం



గుంతల్లో నీరు చేరి చెరువును తలపిస్తున్న అంగలకుదురు- యడ్లపలి రహదారి



గుంతలమయమైన కోపల్లె రహదారి



శిథిలావస్థకు చేరిన కఠెవరం వంతెన

- గుంతలమయమై ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- వరుస ప్రమాదాలతో ఆసుపత్రిపాలవుతున్న ప్రజానీకం

తెనాలిటౌన్: మండలంలోని వివిధ గ్రామాల రహదారులు అధ్వాన్నంగా మారాయి. కంకర తేలి గుంటలు పడుతుండటంతో స్థానికులు, ప్రయాణీకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రూరల్ మండలం అంగలకుదురు, యడ్లపల్లి రహదారి గుంతలమయమై ప్రమాదాలకు నెలవుగా మారింది. దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డంతా గుంతలు పడటంతో వాహనరాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. ఈ రహదారి కూడా నిత్యం ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, బస్సులు, లారీలు తిరుగుతుంటాయి. ఏదైనా పెద్ద వాహనం వచ్చినప్పుడు ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ఈ గుంతల్లో పడి నిత్య ప్రమాదం బారినపడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సంక్రాంతిలోపు రహదారులను బాగు చేస్తామని బూటకపు ప్రకటనలు, ఆర్భాటపు ప్రచారాలు చేయడం మినహా ఆచరణలో చేసింది ఏమిలేదు. నేలపాడు, తేలప్రోలు, ఎరుకలపూడి, కఠెవరం, కోపల్లె రహదారుల పరిస్థితి ఇదే మాదిరిగా ఉంది. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళు అయినా నేటికీ గ్రామాల్లో రోడ్ల మరమ్మతులు చేయకపోవడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు.

వీఎస్సార్ కళాశాల నుంచి ఆటోనగర్ వరకు ఉన్న నాలుగు లైన్ల రహదారి కనీసం తాత్కాలిక మరమ్మతులకు నోచుకోక పెనుప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహనదారులు ఈ రహదారిపై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి ఇలాకాలో రోడ్ల మరమ్మతులను చేయకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో జరిగే సభలు, సమావేశాల్లో మంత్రి నాదెండ్ల మనోహర్ రాష్ట్రంలో రోడ్డులో బాగు చేశామని చెప్పడం విడ్డూరంగా ఉందని నియోజకవర్గ ప్రజలు విమర్శిస్తున్నారు. తెనాలి నియోజకవర్గంలో గ్రామీణ రహదారులు గుంతలమయమై ఉన్న పరిస్థితి కూటమి నేతలకు కనిపించడం లేదని పెదవి విరిస్తున్నారు. కఠెవరం వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ వంతెనపై ఇరువైపులా ఉన్న రైలింగ్ విరిగిపోయి పలు ప్రమాదాలు సంభవించాయి. ఈ రహదారి మీదుగా నిత్యం ఆటోలు, ద్విచక్ర వాహనాలు, స్కూల్ బస్సులు తిరుగుతుంటాయి. గ్రామస్తులు అనేకమార్లు ఆర్ అండ్‌బీ అధికారులకు విజ్ఞప్తి చేసిన గ్రామస్థుల వినతిని ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దాదాపు తాడిచెట్టు లోతు వంతెన కింద కాల్వ ప్రవహిస్తుంటుందని మధ్యకాల్వపై నివసించే ప్రజలు అనేకమార్లు ఈ కాల్వల్లో పడి ప్రమాదానికి గురైన సందర్భాలు లేకపోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామీణ రహదారులకు కనీస మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

రైతులు నానో యూరియా వాడాలి

ఏవో హేమంత్ భరత్ కుమార్



రైతులతో మాట్లాడుతున్న ఏవో హేమంత్ భరత్‌కుమార్



రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పిస్తున్న ఏవో బ్రహ్మారెడ్డి

అమర్తలూరు(వేమూరు): రైతులు యూరియాకు బదులుగా నానో యూరియా వాడాలని మండల వ్యవసాయాధికారి ఎం.హేమంత్ భరత్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రస్తుత పరిస్థితుల్లో యూరియా కన్నా నానో యూరియా వినియోగించుకోవడం మంచిదన్నారు. నానో యూరియా నైట్రోజన్ వినియోగ సామర్థ్యంను గణనీయంగా పెంచుతుందన్నారు. మొక్కలు పెరుగుదల ధారాళమైన దిగుబడి నాణ్యతను మెరుగుపరుస్తుందన్నారు. సాధారణ యూరియాపై ఆధారపడడాన్ని తగ్గించాలని, దీంతో ఖర్చులు కూడా తగ్గుతాయన్నారు. భూమిలో కరగకుండా ఉన్న నైట్రోజన్‌ని కూడా కరిగించి మట్టి నీటి కాలుష్యాన్ని నానో యూరియా తగ్గిస్తుందన్నారు. పంట కాలంలో రెండు సార్లు ఉపయోగించాలని ఆయన రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి డి.మాధవి, గ్రోమోర్ సెంటరు ప్రతినిధి గోపి, రైతులు పాల్గొన్నారు.

యూరియాకు ప్రత్యామ్నాయం నానో యూరియా : ఏవో

భట్టిప్రోలు: రైతులు యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడుకోవడం ద్వారా ప్రయోజనాలు సమంగా ఉంటాయని మండల వ్యవసాయ శాఖాధికారి బి.బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం భట్టిప్రోలు, కోనేటిపురం గ్రామాలలో రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భట్టిప్రోలులో రైతులతో బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ మండలంలో యూరియా సమృద్ధిగా లభిస్తుందని పేర్కొన్నారు. నానో యూరియా అర లీటర్ రూ.250కు లభిస్తుందని, దీనిని పిచికారీ చేయడం కూడా సులభమని తెలిపారు. 45 కిలోల యూరియా బస్తాలో ఉండే పోషకాలు అన్నీ అర లీటరు నానో యూరియా డబ్బాలో ఉంటాయని చెప్పారు. యూరియా గుళికల కంటే ద్రవ రూపంలో ఉండే నానో యూరియా మొక్కలపై బాగా పని చేస్తుందని తెలిపారు. నానో యూరియాను మొక్క ఆకులపై పడే విధంగా స్ప్రే చేసుకోవాలని సూచించారు. రైతులు సంప్రదాయ యూరియాకు బదులుగా ఈ నానో యూరియాను వాడటం అలవాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

చుండూరు(వేమూరు): రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు యూరియా అందజేయడం జరుగుతుందని తహసీల్దారు నాగరాజు తెలిపారు. చుండూరు మండలంలోని ఆలపాడు, మండూరు గ్రామాల్లో గురువారం యూరియా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఆలపాడు రైతు సేవా కేంద్రంలో 29.8 మెట్రిక్ టన్నుల యూరియా, మండూరులో 29.8 మెట్రిక్ టన్నులు యూరియా రైతులకు అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మండూరు రైతు సేవా కేంద్రంలో యూరియాను తహసీల్దారు నాగరాజు పరిశీలించారు. రైతులకు యూరియా కొరత రాకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి లేదని తెలిపారు.

ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసన్

చెరుకుపల్లి: నివాస ప్రాంలాల్లో మురుగు నీటి నిల్వలు ఉండటం వల్ల వేగంగా దోమలు వృద్ధి చెందుతాయని డిప్యూటీ ఎంపీడీవో కేజీఏ శ్రీనివాసన్ అన్నారు. మండల కేంద్రంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు దోమల బెడద ఎక్కువగా ఉందని తెలుసుకుని పంచాయతీ సిబ్బంది, వైద్యారోగ్య శాఖ అధికారులు గురువారం చెరుకుపల్లి పంచాయతీ కార్యాలయం నుంచి మలాతియన్ ద్రావణంను మిషన్ ద్వారా వీధుల్లో ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి వారి నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఇంటి పరిసరాల్లోని చెత్తను వీధుల్లో వేయకుండా పంచాయతీ సిబ్బందికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో కావూరు ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ సీహెచ్ శ్రీనివాసరవు, పంచాయతీ కార్యదర్శి మల్లిఖార్జునరావు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆటో వర్కర్స్ జిల్లా అధ్యక్షుడు బుచ్చిరాజు



బాపట్ల అర్బన్: ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.బుచ్చిరాజు పేర్కొన్నారు. బాపట్ల పట్టణంలోని ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఆటో వర్కర్స్ యూనియన్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బుచ్చిరాజు మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం కల్పించటంతో ఆటో వర్కర్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు శరత్, బాపట్ల ఇంజనీరింగ్ ఆటో యూనియన్ నూతన కమిటీ అధ్యక్షుడు కె.మరియదాసు, నాయకులు డి.శ్రీనివాసరావు, పి.వీరారెడ్డి, కె.ఎలీషా బాబు, బాపట్ల ఆటో స్టాండ్స్ నాయకులు కె.శ్రీను, షేక్ వలి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



నిరసన తెలియజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

తెనాలిఅర్బన్: ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన వెంటనే 4డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గంగానమ్మపేటలోని సంస్థ కార్యాలయంలో గురువారం ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ముందుకు రాకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలన్నారు. ప్రధాన కార్యదర్శి ఎండీ ఖలీద్ మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ వరకు ప్రతిరోజు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాద్ బాషా, తెనాలి జోన్ కన్వీనర్ పుట్టా జనార్ధనరావు, మండల అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అంకినీడుప్రసాద్, నాయకులు కె.లక్ష్మయ్య, డి.వెంకటేశ్వరరావు, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

15న శ్రీవైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు



కరపత్రాన్ని ఆవిష్కరించిన శ్రీనరేంద్ర రామానుజ దాసస్వామి

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీశరణాగతి గోష్ఠి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన శ్రీవైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరగనున్నాయి. స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని లక్ష్మీనగర్ కాలనీలో పాలాద్రి కాల్వ పక్కన ప్రత్యేక వేదికపై శ్రీనరేంద్ర రామానుజ దాసస్వామి నేతృత్వంలో జరగనున్న వేడుకల కరపత్రాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఉదయం భగవన్నామ సంకీర్తన అమృతం, తదుపరి సాయంత్రం 3 గంటలకు తిరుమంజనం, 5 గంటలకు ఉట్టి మహోత్సవం, 6 గంటలకు శ్రీకృష్ణ జన్మాష్టమి పూజ, 7.30 గంటలకు 64 రకాల ప్రసాదాల నివేదన, 8 గంటలకు మంగళా శాసనం, శాత్తుమురై, 8.30 గంటలకు తీర్థప్రసాద గోష్ఠి ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో నరేంద్ర రామానుజ దాసస్వామితోపాటు ముద్దాభక్తుని రమణయ్య, తన్నీరు సీతారామాంజనేయులు, సోమరౌతు నాగేంద్రయ్య, విష్ణుమొలకల శ్యామసుందరరావు, కొడాలి రాజ్యలక్ష్మి, కొడాలి సుబ్బలక్ష్మి, లక్ష్మీకుమారి, తట గోపి, వుగ్గాల పున్నారావు, తాడికొండ కిషోర్ పాల్గొన్నారు.

దివంగత కళాకారులను స్మరించుకోవటం మన కర్తవ్యం

ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ

తెనాలి: కమ్యూనిస్టు పార్టీకి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలికి కీర్తిప్రతిష్టలు తీసుకొచ్చిన కళాకారులను స్మరించుకోవటం మన కర్తవ్యమని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ అన్నారు. ప్రజానాట్యమండలి, తెనాలి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమర కళాకారుల సంస్మరణ కార్యక్రమం నాలుగోరోజైన గురువారం కొనసాగాయి. సాయంత్రం గాంధీనగర్‌లోని 'ఇస్కఫ్' కార్యాలయంలో జరిగిన సభలో సూరపనేని లక్ష్మీ పెరుమాళ్లను స్మరించుకున్నారు. ఆమె నటించిన నాటకాలు, పోషించిన పాత్రలు, కళావైదుష్యాన్ని వక్తలు తమ ప్రసంగాల్లో గుర్తుచేసుకున్నారు. వీరితోపాటు వెంపటి రాధాకృష్ణ, పరుచూరి హనుమంతరావు, రామకోటి, కర్నాటి లక్ష్మీనరసయ్య, అల్లు రామలింగయ్య, గుమ్మడి కుటుంబరావు, డీపీఎస్ ఆర్ సుబ్బారావు, కోగంటి గోపాలకృష్ణయ్య తదితర వందమందికి పైగా కళాకారురులు ప్రజాచైతన్యం కోసం కృషిచేశారని చెప్పారు. సీపీఐ తెనాలి నియోజకవర్గ సహాయ కార్యదర్శి తుంగ బాలస్వామి అమర కళాకారులకు జోహార్లు చెప్పారు. కళాకారులు, గాయకులు పాల్గొన్నారు.

13న తెనాలిలో నృత్యపోటీలు



కరపత్రం ఆవిష్కరించిన డాక్టర్ జీవనలత

తెనాలి: పట్టణానికి చెందిన రెయిన్‌బో ట్రస్ట్, శ్రీ లక్ష్మీనారాయణ కూచిపూడి నృత్య కళానికేతన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన మహిళలు, నృత్యం నేర్చుకున్న వారికి మాత్రమే నృత్య పోటీలను నిర్వహించనున్నారు. సంబంధిత కార్యక్రమ కరపత్రాన్ని రెయిన్‌బో ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.జీవనలత గురువారం ఆవిష్కరించి, వివరాలను తెలియజేశారు. కొత్తపేటలోని శ్రీ రాధాకృష్ణ కల్యాణమండపంలో ఆరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నృత్య పోటీలు జరుగుతాయని చెప్పారు. ఫోక్, వెస్టన్ డ్యాన్స్ విభాగాల్లో 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు మాత్రమే అర్హులని, ఒక్కో బృందంలో 6–8 మంది సభ్యులు పాల్గొనవచ్చునని ప్రదర్శన సమయం ఎనిమిది నిముషాలని తెలిపారు. క్లాసికల్ సోలో డ్యాన్స్ పోటీల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థినులు మాత్రమే పాల్గొనాలనీ, ఒక్కొక్కరికి ఎనిమిది నిముషాల సమయం ఇస్తామని తెలిపారు. ఆసక్తిగలవారు 90143 69149 నంబరును సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జి.అనూరాధ, కోట భవాని, భవ్యజ్యోతి పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం



జంపనిలో స్కూల్ గేమ్స్‌ను ప్రారంభించిన ఎంఈవో వెంకటేశ్వర్లు



భట్టిప్రోలు హైస్కూల్‌లో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ లలితకుమారి

జంపని(వేమూరు): విద్యార్థులు క్రీడాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మండల విద్యాశాఖాధికారి ఐ.వెంకటేశ్వర్లు తెలిపారు. వేమూరు మండలంలోని జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్జీఎఫ్ మండలస్థాయి ఆటల పోటీలు గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో స్కూల్ గేమ్స్ నిర్వహించి మండల స్థాయి క్రీడాకారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను డివిజనల్ స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్ ఎన్.రవిసాగర్, వ్యాయమ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక

భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆదేశాల మేరకు గురువారం భట్టిప్రోలులో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక కార్యక్రమంలో భాగంగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు స్థానిక టీఎంరావు హైస్కూల్‌లో జరగ్గా, ఎంపీపీ దాసూరి వెంకట లలితకుమారి ప్రారంభించారు. మండలంలోని 7 జిల్లా పరిషత్, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు పాల్గొన్నారు. అండర్–14, అండర్–17 బాలబాలికలకు రన్నింగ్, షార్ట్ పుట్, డిస్కస్ త్రో, అథ్లెటిక్స్, ఈవెంట్స్‌లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 100 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా సర్పంచ్ దారా రవికిరణ్మయి, ఎంఈవో నీలం దేవరాజ్, ఉప సర్పంచ్ బూర్లె రామ్‌ప్రసాద్, కరస్పాండెంట్ పి.మల్లిఖార్జునరావు పాల్గొన్నారు. శుక్రవారం బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు కో ఆర్డినేటర్ చేబ్రోలు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చందలూరి రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు కె.కోటేశ్వరమ్మ, బెల్లంకొండ శ్రీనివాసరావు, ఎండీ అనూల్‌హక్, జీవీఎస్ నాగేశ్వరరావు, వాకా హరి ప్రసాద్, వి.శ్రీనివాసరావు, పి.బాబు, శ్రీనివాసరెడ్డి, కె.లక్ష్మి, ఆర్‌పీ పద్మ, దారా చెన్నయ్య, దావూరి నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.